అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలి

- డివిజన్‌లో పర్యటించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించే విధంగా చూడాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో నూతనంగా వేస్తున్న రోడ్లను జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, హరీశ్, అడికె జనార్దన్, తలారి చిన్నా, పాండు, రఘుయాదవ్, సుజాత, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్వేను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తదితరులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ఘాన్సి మియాగూడలో కులగణ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కమిషనర్ బి.సుమన్ రావు పరిశీలించారు. సర్వేలోని ఆయా అంశాలకు ప్రజలు ఎలాంటి సమాధానాలు ఇస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కులగణ సర్వేతో బలహీన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తుందన్నారు. ప్రజలందరూ కూడా కులగణనకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణి, మాజీ ఎంపీటీసీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలి



రాజేంద్రనగర్: బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త చెదారాలను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. మంగళవారం సర్కిల్ పరిధిలోని డైరీఫామ్ జంక్షన్ వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇంటి వద్దకు వచ్చే ఆటోరిక్షాలకు చెత్త చెదారాలను అందజేయాలని ప్రజలకు సూచించారు.



వ్యాపారులతో చర్చిస్తున్న పోలీసులు, స్థానికులు

సంత మార్పు.. కొంత ఊరట

రాజేంద్రనగర్: శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీ (శివాజీనగర్)లో వారాంతపు సంతను మార్చారు. దీంతో స్థానికంగా దుర్గంధం, పారిశుద్ధ్య సమస్యలకు చెక్ పెట్టినట్లు అయింది. కొంతకాలంగా కాలనీ ప్రధాన రోడ్డుపై ప్రతి మంగళవారం ఏర్పాటు చేసే వారాంతపు సంతతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌కు స్థానికులు పలుమార్లు వినతిపత్రాలు కూడా అందజేశారు. తాజాగా మంగళవారం సంత ఉండటంతో ఆయా కాలనీల పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున సంఘటనాస్థలానికి చేరుకున్నారు. సంత ఏర్పాటు చేయొద్దంటూ అక్కడే టెంట్ వేసుకొని కూర్చున్నారు. దీంతో వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జీవన్ దాస్, సురేశ్, ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డి.రమేశ్, పి.వెంకటేశ్, డి.అంజనేయులు తదితరులతోపాటు అత్తాపూర్ పోలీసులు వచ్చి వ్యాపారులకు నచ్చచెప్పారు.



హెచ్‌సీయూ-ఎంఐఐహెచ్ ఎంఓయూ

రాయదుర్గం: మైక్రో ఇన్సూరెన్స్ రంగంలో పురోగతి లక్ష్యంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ-మైక్రో ఇన్సూరెన్స్ ఇన్నోవేషన్ హబ్ (ఎంఐఐహెచ్)ల మధ్య ఒప్పందం కుదరింది. ఈ మేరకు మంగళవారం ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం అభివృద్ధి, సామర్థ్యాలను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై దృష్టి సారిస్తుంది. సెంట్రల్ యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ దేబాశీష్ ఆచార్య వ్యవహరిస్తారు. అలాగే ఎంఐఐహెచ్‌కి సమన్వయకర్తగా ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుప్రియా గోలి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ మేరకు ఎంఐఐహెచ్ ఫౌండర్ అసోసియేట్ మైక్రో ఎన్సూర్ సీఈఓ కమలాకర్‌సాయి పలవాసల, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజేరావు మాట్లాడుతూ ఈ ఒప్పందంతో నైపుణ్యం పెంపొందించడానికి, వాటాదారులకు శిక్షణ ఇవ్వడానికి, జ్ఞాన భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ ప్రొఫెసర్ ఆర్ విజయ్, ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సబాత్,హెచ్‌సీయూ పీఆర్ఓ ఆశిష్ జోకబ్ థామస్, మైత్ర దాసరి, అలేఖ్య వాకలపూడి, అదితి, ఆయేషా, సున్నం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్ తదితరులు

శంషాబాద్: జీఎంఆర్ చిన్మయ విద్యాలయంలో జరిగిన ఖేల్ మిలన్ పోటీలు సోమవారం ముగిశాయి. జాతీయస్థాయి చిన్మయ విద్యాలయాల మధ్యన జరిగిన ఈ పోటీల్లో వందలాదిమంది విద్యార్థులు ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యతోపాటు క్రీడల్లో విద్యార్థులు ఆసక్తి కనబర్చాలని జీఎంఆర్ స్పోర్ట్స్ సీఈఓ పి.కె.ఎస్.వి. రాజు సూచించారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుతులు ప్రదానం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎ.మల్లేష్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- కిస్మత్‌పూర్ ఫీడర్ పరిధిలో కిస్మత్‌పూర్ గ్రామం, రాఘవేంద్ర కాలనీ, శివసాయి కాలనీ, బాబమ్మ కాలనీ, మైత్రికాలనీ, వినాయకనగర్, మారుతీనగర్ కాలనీ, ఎస్సీ బస్తీ, శ్రీ కృష్ణకాలనీ, విల్లా గ్రీన్, ఆద్యా విల్లాస్, ఓఎస్ ఎక్స్ విల్లాస్, గృహశిల్ప, గిరిధారి అపార్ట్‌మెంట్, హనుమాన్ టెంపులు.
- బండ్లగూడ ఫీడర్ పరిధిలో 10 నుంచి ఒంటి గంట వరకు మైసమ్మ మెయిన్ రోడ్డు, కపిలా నగర్, ఎస్ఎఫ్‌సీ కాలనీ, మల్లికార్జుననగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 1, 5 న్యూ కేర్ ఆసుపత్రి, గాయత్రీనగర్, వికాస్ నగర్, ద్వారకా నగర్, యాదవమిత్ర కాలనీ, షిర్డీ సాయిబాబా కాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంత్ కాలనీ కమ్యూనిటీ హాల్, భారతీనగర్.

రాజేంద్రనగర్: మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఆదర్శనగర్, నాయుడుకాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ఆదర్శనగర్ విలేజ్, మంజు బార్, ఆరాంఘర్ పిస్తాహౌస్, కింగ్స్ సరేనా, లక్ష్మీ నారాయణ విల్లాస్, మెట్రో కన్వెన్షన్, నాయుడు కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, డ్రీమ్ వాలే విద్యుత్ ఫీడర్ పరిధిలోని నిజాం ఫంక్షన్ హాల్, ఆరాంఘర్ పోలీస్‌స్టేషన్ గల్లీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజల్లో ఉండేవారికే గుర్తింపు



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్‌బాబుయాదవ్

బండ్లగూడ: ప్రజల్లో ఉండే నాయకులకు తప్పక గుర్తింపు, ఆదరణ ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన మామిళ్ల శేఖర్‌బాబు యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు కుమార్‌గౌడ్, నాయకులు హనుమంత్, సాయి రాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: అనారోగ్యాల బారిన పడుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 5వ డివిజన్ సాయిహర్ష కాలనీకి చెందిన జ్యోతి గత కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. దీంతో ఆమెకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును జ్యోతి కుమారుడు సంతోష్‌కు మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనాథ్‌రెడ్డి, సాగర్‌గౌడ్ నాయకులు కృష్ణారెడ్డి, బోగాల శ్రీనివాస్, తలారి ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



శాస్త్రీపురం సమావేశంలో మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, కార్మికులు

అత్తాపూర్: మున్సిపాలిటీల్లోని పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. శాస్త్రీపురం డివిజన్ పరిధిలో రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికుల సమావేశాన్ని రాఘవేంద్ర కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా మున్సిపల్ కార్మికులకు ప్రతి నెలా ఒకటో తారీకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి టి.ఆనంద్, శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, అరుణ్, వెంకటేష్, విక్రమ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక...

శాస్త్రీపురం డివిజన్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంజిత్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేణు, ఉపాధ్యక్షులుగా అనిత, రూబేల్, లక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శి సి.శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు శంకరయ్య, నరేష్, శకుంతల, కోశాధికారి సునీత, సభ్యులు సత్యమ్మ, శంకరమ్మ, రాములమ్మ, సత్తయ్య, గిరి, బాలమణి, అనిత, బుచ్చయ్య, సుశీల, జే.అనిత, దానియల్, మరో 6 మందిని కోఆప్షన్ సభ్యులుగా, నూతన కౌన్సిల్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వేణుగౌడ్


మణికొండ: నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నార్సింగి మున్సిపాలిటీకి చెందిన కోట వేణుకుమార్‌గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయనతోపాటు వైస్ చైర్మన్‌గా మంచిరేవులకు చెందిన క్యాతం దశరథ యాదవ్, సభ్యులుగా మొద్దు నర్సింహ, బుద్ధోలు రాజు, మామిళ్ల శేఖర్‌బాబు యాదవ్, అబ్దుల్ సాదిఖ్, ఏర్పుల కుమార్, మాచర్ల రాజు, దుర్గపల్లి బాలరాజు, బీవీ లక్ష్మీ, అనెగోని శ్రీకాంత్‌గౌడ్, బి.బాల్‌రెడ్డి, తలారి ప్రేమ్‌కుమార్, అరికె మల్లేష్‌లను నియమించారు. వీరితోపాటు చిన్నగోల్కొండ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్, నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌లు సభ్యులుగా ఉన్నారు. గండిపేట, శంషాబాద్ మండలాల నుంచి డైరెక్టర్‌లను ఎంపిక చేశారు. నార్సింగి పశువుల మార్కెట్, ఎర్రగడ్డలోని బబ్బుగూడ, శంషాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌లకు వచ్చే రైతులు, వ్యాపారులకు తమ వంతు సేవలు అందిస్తామని, ప్రజలకు సౌకర్యవంతంగా మార్కెట్‌లను అభివృద్ధి చేస్తామని వేణుకుమార్‌గౌడ్ అన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పాలకవర్గం

నార్సింగి మార్కెట్ కమిటీ పాలకవర్గం మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ఆయన చేతుల మీదుగా జీవో పత్రాన్ని అందుకున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డిని కలిశారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చేతుల మీదుగా జీవో కాపీని అందుకున్న పాలక కమిటీ







కాంగ్రెస్‌లో కష్టపడిన వారికి గుర్తింపు లేదు..



మాజీ ఉపాధ్యక్షులు సాయిరెడ్డి

మణికొండ: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు లేకుండా పోతోందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 27 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నానని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఒక సర్పంచ్, ఎంపీటీసీ పదవులను తన ఆధ్వర్యంలో గెలుచుకున్నామని చెప్పారు. అలాంటి తనకు ఒక్క నామినేటెడ్ పదవి కూడా ఇప్పటివరకు దక్కలేదని విచారం వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న జ్ఞానేశ్వర్, కస్తూరి నరేందర్, గండయ్య, జైపాల్‌రెడ్డి వంటి నాయకులకు గుర్తింపు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. మణికొండలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన నాయకులను విస్మరిస్తున్నారని, వలస వచ్చినవారికే అందలం ఎక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి



కులగణనలో పేర్లు నమోదు చేయిస్తున్న రామకృష్ణ

రాజేంద్రనగర్: సమగ్ర కులగణన సర్వేకు అందరూ సహకరించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఇక్కడ అధికారులు నిర్వహించిన కులగణనలో ఆయన వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పేరుతో ఇంటింటి సర్వే నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలందరూ ఉద్యమ స్ఫూర్తితో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజల్లో కుల గణనపై అవగాహన లేక వివరాలు నమోదు చేసుకోవడం లేదన్నారు. ప్రజలకు అవగాహన కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం టీవీ, డిజిటల్ యాడ్స్, పేపర్ యాడ్స్‌తోపాటు కుల సంఘం పెద్దలతో చర్చించాలన్నారు.

సత్కారం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శర్మాజీ యోగా సెంటర్‌లో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచితంగా యోగా నేర్పిస్తున్న మణిదీప్ కౌర్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆమెను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం ఒక గంట సేపు యోగా సాధన చేస్తే ఆరోగ్యం చాలా బాగుంటుందన్నారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి యోగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రాణాయామం ద్వారా శరీరానికి, మనసుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వై.శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, దాష్మంత్ రెడ్డి, ఆశీష్, సాహు, నరేందర్ రెడ్డి, బాల్‌రెడ్డి, అశోక్, పటేల్, బల్జీత్ కౌర్, శివ తదితరులు పాల్గొన్నారు.



మణిదీప్ కౌర్‌ను సన్మానిస్తున్న వై.శ్రీధర్, రాజశేఖర్‌రెడ్డి, దాష్మంత్ రెడ్డి, ఆశీష్, సాహు, నరేందర్ రెడ్డి తదితరులు

కాంగ్రెస్ కండువా కప్పుకోనివారికీ పదవులా?



దుద్దు ప్రణయ్

మణికొండ: కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోని వారికి కూడా పదవులు ఇస్తే, మరి పార్టీ కోసం కష్టపడి అక్రమ కేసులు అనుభవిస్తున్న వారి పరిస్థితి ఏమిటని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దుద్దు ప్రణయ్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులను కాదని, బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చినవారికి పదవులు కట్టబెడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వీరు ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ కండువాను కూడా కప్పుకోకుండానే డైరెక్టర్ పదవులు దక్కించుకున్నారని అన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడిన నాయకుల్ని వదిలేస్తారా, తమ అవసరం పార్టీకి లేదా అని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియనివ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శంషాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దషాపూర్ గ్రామ పరిధిలో సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి (54) రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.